క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నాగలాపురం: మండలంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. తిరుపతి డివిజన్ తనిఖీదారులు పి.పణిరాజశయన్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ 41 రోజులకు గాను హుండీలో రూ.3,61,784 నగదు, బంగారం 044.045 మిల్లీగ్రాములు, వెండి 904 గ్రాములు వచ్చినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవి, ఆలయ సిబ్బంది పరంధామరెడ్డి, శరవణ, సేతు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ



డ్రైనేజీ పనుల ప్రారంభానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

నాగలాపురం: స్థానిక బీసీ కాలనీలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను గురువారం నిర్వహించారు. కాలనీలో రూ.30 లక్షల అంచనాతో మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజి నాయక్, తహసీల్దార్ హనుమాన్ నాయక్, రెవెన్యూ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్ ఉదయ్ కుమార్, నాయకులు ఇలంగోవరెడ్డి, శేషాద్రి, సెల్వకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవదాయశాఖ అదేశాల మేరకు ఆలయ ఆవరణలోని 16 కాళ్ల మండపం వద్ద వాల్మీకి చిత్రపటం ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అంబూరులో మేతబీడు ఆక్రమణ



అంబూరులో ఆక్రమణకు గురైన మేతబీడు భూములు

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో మేతబీడు భూములను స్థానిక టీడీపీ నేత దర్జాగా ఆక్రమించుకుంటున్నాడు. రెవెన్యూ అధికారులు పాతిపెట్టిన సర్వే రాళ్లను దౌర్జన్యంగా తొలగించి భూములను ఆక్రమిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఆ మేరకు అంబూరు గ్రామ లెక్కల దాఖల సర్వే నం.274, 275లో సుమారు 25 ఎకరాల మేతబీడు భూములు ఉన్నాయి. ఇటీవల ఈ భూములకు రెవెన్యూ అధికారులు సర్వే రాళ్లను సైతం ఏర్పాటు చేశారు. అయితే స్థానికంగా ఉన్న టీడీపీ నాయకుడు ఏకంగా 10 ఎకరాలను ఆక్రమించి ట్రాక్టర్‌తో దున్నకాలు చేస్తున్నా ఆపే దిక్కు లేదు. దీనిపై స్థానిక సర్పంచ్ సాయిరెడ్డి, మరికొందరు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించి మేతబీడు భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేటి నుంచి ఉప సర్పంచులకు శిక్షణ

సత్యవేడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి పంచాయతీ ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు శుక్ర, శని వారాలు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. పంచాయతీల విధులు, అధికారాలు, బాధ్యతలు..ఇత్యాది అంశాలపై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. 28 పంచాయతీలకు సంబంధించిన ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. పంచాయతీలకు శాపం

'విద్యుత్ ఆదా చేయండి..సంస్థకు సహకరించండి'..'ఒక యూనిట్ ఆదా చేస్తే రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానం..'..ఇలా ఎన్నో స్లోగన్లు మనం చెల్లించే కరెంటు బిల్లుల వెనుక సందేశాల రూపంలో ఉంటాయి. అయితే ఇవన్నీ చెబుతున్న ట్రాన్స్‌కో శాఖ మాత్రం పాటించడం లేదు. ఎక్కడికక్కడ విద్యుత్ వినియోగం దుబారా కాకుండా చూడాల్సిన బాధ్యతను గాలికొదిలేయడంతో రేయింబవళ్లూ వీధి లైట్లు వెలుగుతూ విద్యుత్ వృథా అవుతోంది. కరెంటు దుబారా మూలాన మరోవైపు గ్రామ పంచాయతీలకు బిల్లుల షాక్ కొడుతోంది.

- వీధి లైట్లకు నిత్యం వెలుగులే..!
- గ్రామాల్లో కరెంట్ ఉన్నంత సేపూ ఆరని లైట్లు
- ప్రత్యేక లైను ఏర్పాటులో నిర్లక్ష్యం
- వృథా అవుతున్న విద్యుత్
- పంచాయతీలకు కరెంటు బిల్లులు షాక్



కోవూరుపాడులో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

వరదయ్యపాళెం: మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 100కు పైగా గ్రామాలున్నాయి. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ ద్వారా వీధి లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ట్రాన్స్‌కో అధికారులు లైన్లు లాగే సందర్భంలో ప్రత్యేకించి వీధి లైట్ల కోసం ప్రత్యేక లైను ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల ఈ సౌకర్యం ఉన్నప్పటికీ మెజారిటీ గ్రామాల్లో వీధి లైట్లు నిర్వహణకు ప్రత్యేక లైన్లు లేవు.

వృథా అవుతున్న విద్యుత్

మండలవ్యాప్తంగా దాదాపుగా 70 గ్రామాలలో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. వీధిలైట్లకు సంబంధించి ప్రత్యేక లైను లేకపోవడంతో లైట్లను రోజూ ఆఫ్ చేసే పరిస్థితి లేదు. దీంతో నిరంతరంగా వెలుగుతుండడం వల్ల విద్యుత్ వృథా అవుతోంది.

పంచాయతీలకు బిల్లుల భారం

గ్రామాల్లో వీధి లైట్లు నిరంతరం వెలుగుతున్న కారణంగా పంచాయతీలపై విద్యుత్ భారం అధికమవుతోంది. ప్రత్యేక లైను ఏర్పాటు చేయమని ట్రాన్స్‌కో అధికారులకు మొర పెడుతున్నా పట్టించుకోవడం లేదని సర్పంచులు వాపోతున్నారు. విద్యుత్ వృథా అవడమే కాకుండా నిరంతరంగా వెలుగుతున్న



కురింజల్లంలో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

కారణంగా నూతనంగా వేసిన విద్యుత్ లైట్లు సైతం తక్కువ రోజులకే పాడవుతున్నట్లు సర్పంచులు వాపోతున్నారు. నిధుల లేమితో పంచాయతీ నిర్వహణ అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి పంచాయతీల అధిక బిల్లులతో పాటు వీధిలైట్ల నిర్వహణ భారమవుతుందని గగ్గోలు పెడుతున్నారు.

పట్టించుకోవడం లేదు



వీధి లైట్లకు ప్రత్యేకించి గ్రామాల్లో లైన్లు ఏర్పాటు చేయమని ట్రాన్స్‌కో అధికారులకు వ్యక్తిగతంగా, సర్వసభ్య సమావేశాల్లో కోరినా పట్టించుకోవడం లేదు. దీని కారణంగా ప్రతి స్తంభానికీ లైటు ఆపేందుకు స్విచ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటే పంచాయతీలకు ఎంతో మేలు చేసినట్లే.

-సాయిరెడ్డి, సర్పంచ్, అంబూరు

తక్కువ రోజులకే లైట్లు ఔట్



స్తంభాలకు వేసిన వీధిలైట్లు నిరంతరంగా వెలుగుతున్న కారణంగా వీధి లైట్లు తక్కువ రోజులకే పాడవుతున్నాయి. కారణం లైట్లను రోజువారీ తెల్లవారుజాము ఆపే పరిస్థితి లేకపోవడమే. దీంతో వేసిన 10రోజులకే లైట్లు పాడవడంతో పంచాయతీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

-దీప, సర్పంచ్, కాంబాకం

బిల్లుల మోత



గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం పెనుభారమవుతోంది. పంచాయతీలలో వీధి లైట్ల నిర్వహణకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు కానందువల్ల పగలు, రాత్రి తేడా లేకుండా లైట్లు వెలుగుతున్న పరిస్థితి. దీంతో చిన్న పంచాయతీలకు సైతం లక్షల్లో బిల్లులు వస్తున్నాయి. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి ప్రతి గ్రామంలో వీధిలైట్ల నిర్వహణకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలి.

-చంద్రారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు

ఇళ్ల మధ్య మురుగు



రేణిగుంటలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో సంచరిస్తున్న పందులు

- పందులకు ఆవాసం
- ప్రజలకు సంకటం

రేణిగుంట: పట్టణంలో ఇళ్ల మధ్యలో నున్న ఖాళీ స్థలాల్లోని మురుగు నీటి నిల్వ కాస్తా చినపాటి కుంటలను తలపిస్తున్నాయి. ఇవి కాస్తా పందుల ఆవాసంగా మారాయి. దీంతో ఆ ప్రాంతాలు అపరిశుభ్రత తాండవిస్తూ ప్రజలను అనారోగ్యం పాల్జేస్తున్నాయి. వర్షాలకు మరింత అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని అన్ని వీధుల్లోనూ ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు మొలచి చిన్నపాటి మురుగునీటి గుంతలను తలపిస్తున్నాయి. పందులు ఎక్కువగా అలాంటి ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని తిష్ట వేస్తున్నాయి. దీనికితోడు పట్టణంలో వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకుండా ఎక్కడికక్కడ ఇళ్ల మధ్య నిలిచిపోతున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలను శుభ్రం చేయించడంతోపాటు పందుల కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షానికి దెబ్బతిన్న వరి పంట పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మూడు రోజులుగా కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని కుక్కంబాకం, తలారివెట్టు, కారణి, కనమనంబేడు గ్రామాల్లో సుమారు 950 ఎకరాల్లోని వరిపంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింది. గురువారం వ్యవసాయాధికారిణి భారతి దెబ్బతిన్న వరిపంటలను పరిశీలించారు. కష్టపడి వేసిన సాగు చేసిన వరి పంట తుపాను ధాటికి నష్టపోయామనిర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏఓ స్పందిస్తూ, పంట నష్టంపై జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది రేవతి, రైతులు పాల్గొన్నారు.



కుక్కంబాకంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ భారతి

సీసీ రోడ్లకు భూమి పూజ

సత్యవేడు: మండలంలో కొత్తమారికుప్పంలోని గిరిజన కాలనీలో ఉపాధి నిధులు రూ. 2.7లక్షలతో 65 మీటర్ల సిమెంటు రోడ్డు, గ్రామంలో రూ. 3.3 లక్షలతో 80 మీటర్ల సిమెంటు రోడ్డు పనులకు అధికారులు, టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. బుధవారం నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథులుగా సమన్వయకర్త డాక్టర్ శ్రీపతి బాబు, పరిశీలకుడు చంద్రశేఖర్ హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ టీవీ. సుబ్రమణ్యం, ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఏపీఓ కృష్ణయ్య, ఏఈ ఇబ్రహీం ఖాన్, ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, ఎస్ఐ రామస్వామి, మండల టీడీపీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు పరమశివం(బాషా), మాజీ ఎంపీటీసీ అమాసయ్య, శశి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: పట్టణంలో గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ఆయన జ్యోతినగర్, పత్నీకులం, వేణుగోపాలపురం, భగత్‌సింగ్ కాలనీ, గణేష్ నగర్, కరకంబాడి పంచాయతీ తారక రామానగర్‌లో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, సర్పంచ్ నగేషం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కొత్తమారికుప్పంలో సిమెంటు రోడ్డు పనులకు చేస్తున్న భూమి పూజ

కోతకు గురైన తుంబూరు కాజ్‌వే



కోతకు గురైన తుంబూరు కాజ్‌వే

నారాయణవనం: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని అరుణానది ఉధృతికి తుంబూరు కాజ్‌వే కోతకు గురైంది. పాలమంగళం కాజ్‌వేపై మట్టి కొట్టుకుపోయింది. అరుణానది ప్రవాహంతో కోతకు గురైన తుంబూరు, పాలమంగళం కాజ్‌వేలను తాత్కాలిక మరమ్మత్తులు చేయడం తప్పితే శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం లేదు. 2017లో బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస తుఫాన్లకు అప్పట్లో మండలంలోని అరుణానది ఉధృతికి తిరువట్యం, తుంబూరు, పాలమంగళం ఉత్తరపు కండ్రిగ కాజ్‌వే కొట్టుకుపోయాయి. తాత్కాలికంగా ఇసుక బస్తాలు, గ్రావెల్‌తో మరమ్మత్తులు చేయడం తప్పితే పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. మంగళ, బుధవారాలు కురిసిన వర్షాలకు అరుణానది నిండుగా ప్రవహించింది. దీంతో కాజ్‌వేలపై మట్టి కొట్టుకుపోయి కోతకు గురైంది. మరోమారు నది ప్రవహిస్తే పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు శాశ్వత పనులకు పూనుకోవాలని కోరుతున్నారు.

వంటింటి వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

రేణిగుంట: వంటింటి వైద్యం ఎంతో ప్రయోజనకరమని తిరుపతి హోమియో వైద్య నిపుణులు డాక్టర్ రవిచంద్రారెడ్డి అన్నారు. రేణిగుంటలో గురువారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. హాజరైన ప్రజలను పరీక్షించి మందులు అందజేశారు. ఆహారపు అలవాట్లను మార్చుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తవని డాక్టర్ చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పూల వెంకటాద్రి యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శిగా సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సుబ్రమణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఇందిరమ్మ వదరయ్యపాళెం మండలంలోని భక్తలవల్లం గ్రామపంచాయతీకి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామపంచాయతీ నుంచి సుబ్రమణ్యం బదిలీపై వచ్చారు. గ్రామంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. ఆయన్ను సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా కలిసి అభినందించారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి

శ్రీకాళహస్తి: శ్రీకృష్ణదేవరాయల 496వ వర్ధంతి పురస్కరించుకుని గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని రాజగోపురం వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయలకు పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఘన నివాళులు అర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ, శ్రీకృష్ణదేవరాయలు 1529 అక్టోబర్ 17న మరణించారన్నారు. ఆయన విలువలు కలిగిన వ్యక్తి అని, ఆయన మరణించిచి సుమారు 4 శతాబ్దాలు దాటినా ఇప్పటికీ ఆయన్ను స్మరిస్తున్నామంటే ఆయన చేసిన సేవలు, ప్రజారంజక పాలనే కారణమన్నారు. శ్రీకాళహస్తి పట్టణానికే రాజసాన్ని ఉట్టిపడేలా ఉన్న రాజగోపురాన్ని ఆయనే నిర్మించారని, ఆయన తన విజయానికి చిహ్నంగా దీనిని నిర్మించారన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, అంజూరు వెంకటేష్ బాబు, పూడి రవి, కంఠా ఉదయ్, సాదన మున్నా రాయల్, వల్లం గోపి, రమేష్, గరికపాటి చంద్రశేఖర్, గణేష్, సురేష్, యానాది, గంగాధరం, సుబ్బరాజు, మస్తాన్, వెంకటేశ్వర్లు, నరేంద్ర, మణి, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అంజూరు తదితరులు

22 అడుగులకు చేరిన అరణియార్ నీటిమట్టం



అరణియార్ ప్రాజెక్టు

నాగలాపురం: జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. వర్షాలకు ముందు ఈ ప్రాజెక్టులో 18 అడుగుల మేర నీరు ఉండగా.. ప్రస్తుతం 22 అడుగులకు చేరినట్టు ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 31 అడుగులని చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపులు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, నేతలు

తిరుపతి కల్చరల్ : నిబంధనలకు విరుద్ధంగా డీబీఆర్ ఆస్పత్రి పక్కన ఏర్పాటు చేసిన వైన్‌షాపును వెంటనే తొలగించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, సీపీఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు మద్య దుకాణం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గుడి, బడి, హాస్పిటల్స్, నివాసాల మధ్య స్థానికులు వ్యతిరేకించిన ప్రదేశాలలో మద్యం దుకాణాలు పెట్టకూడదన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి వైన్‌షాపులు తెరవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచి మరీ కేటాయించడం ప్రభుత్వానికి తగదని స్పష్టం చేశారు. మద్యం మత్తులోనే హత్యలు, లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని క్రైమ్ బ్యూరో తెలియజేస్తోందని, దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వమే లిక్కర్‌ను ప్రధాన ఆదాయ వనరుగా తీసుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే తిరుపతి జిల్లాకు అత్యధికంగా మద్యం షాపులను కేటాయించడం దారుణమన్నారు. దుకాణ యజమానులు కూడా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది లేని చోట పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేణుగోపాల్, రమణ యాదవ్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పిల్లలు కాదు..పిడుగులే..!

- ఆటస్థలం కావాలని సర్పంచ్‌కు వినతి
- పోరంబోకు స్థలం గుర్తించి కేటాయిస్తామని హామీ ఇచ్చిన సర్పంచ్

ఇక్కడ చిత్రంలో చేతిలో కర్రలు పెట్టుకున్న చిన్నారులు నాగలాపురం మండలం సురుటుపల్లె పంచాయతీ కస్తూరి నాయుడు కండ్రిగకు చెందిన వారు. ఇక వారికి ఎదురుగా ఏదో ఉపన్యాసం ఇస్తున్నట్టు ఉన్న వ్యక్తి సుబ్రమణ్యం. ఆయన ఆ గ్రామ సర్పంచ్ కూడా. ఇంతకూ ఈ చిత్రం చెప్పిన మేటరేమింటే.. ఊరిలోని స్కూలు పిల్లలకు ఆడుకునేందుకు ఆటస్థలమంటూ లేదు. సెలవు దినాల్లో ఆడుకోవాలని తెగ ఉత్సాహం ఉన్నా అనువైన స్థలం లేక వీధుల్లోనే ఆడుకోవాల్సి వస్తోంది. దీంతో దారిన వెళ్లేవారు వారిని..రేయ్ దార్లో ఎంద్రా ఆటలు..పోండ్రా పోండి..అని కసురుకుంటూ ఉండడంతో డీలా పడేవారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు బడుద్దాయిలు సరాసరి దారిలో తమకెదురైన సర్పంచ్‌నే ఊర్లో పిలకాయలకు ఆట స్థలం కేటాయించాలని కోరడంతో ఆయన విస్తుపోయారు. ఏమాత్రం జంకూగొంకూ లేకుండా నిర్భయంగా వారు అడగడం చూసి భలే హుషారుగా ఉన్నారు కదరా? అని వారితో ముచ్చటించారు. గ్రామంలో కొంత మంది పొలాల సమీపాన పోరంబోకు స్థలం ఉందని, ఆస్థలాన్ని గుర్తించి, అధికారులతో మాట్లాడి, ఆట స్థలం ఏర్పాటు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో సర్పంచన్నా..థాంక్సన్నా.. అంటూ ఈ మేటర్ ఊర్లో తమ సహచరులకు చెప్పడానికి పరుగులు తీశారు. గురువారం ఈ సంఘటన చోటుచేసుకుంది.



ఆట స్థలం కావాలని సర్పంచ్‌ను కోరుతున్న చిన్నారులు

–నాగలాపురం